

# మౌన శంఖం

సాయం వేళ!

ఏటి జాలుమీంచి కొంగలు బారు బారులుగా వెళ్తున్న సమయాన, లంకనించి ఆవులు ఇళ్ళకొస్తుంటే లేగదూడలు ఎదురు పరుగెత్తగా ఆవులు దూడల్ని ప్రేమగా నాకుతున్న వేళ గాలిగోపురం శిఖరాల పావురాళ్ళు గుంపులు గుంపులుగా చేరి కువకువలాడుతున్న వేళ గుళ్ళోనించి శంఖం విన్పిస్తోంది .......

భం ... భం ..... శంఖారావం!

గాలినిండా శంఖారావం!

భం...... భం...... శంఖం. వూరంతా విన్పిస్తోంది. అది నాగలింగం శంఖం. నాగలింగం తన ఆరేళ్ళ మనవడు కోటితో పొద్దుకూకటానికి ముందుగానే డోలు, శంఖంతో గుళ్ళోకి చేరుకుంటాడు. మేళగాళ్ళు రావటానికి ముందుగా మంటపంలో కూర్చొని శంఖం వూత్తాడు. ఆ శంఖం వూదేప్పుడు కళ్ళు మూస్తాడు. బుగ్గలు పూరిస్తాడు. నాభి నుంచి నాదం లాగుతాడు. అలా "భం ....... భం..... భం...." అని శంఖం వూత్తుంటే మంటపం కదిలిపోతున్నట్లుంటుంది. గుడి స్తంభాలు, మారేడుచెట్లు, గాలిగోపురం ఆ మోతకి వూగిపోతాయి. పిల్లలంతా చుట్టూ చేర్తారు. వూది వూది చుట్టూ ఉన్న పిల్లల్ని నవ్వుతూ చూస్తాడు. పిల్లలంతా తెల్లగా వున్న ఆ శంఖాన్ని తాకుతారు. వూదబోతారు. నాదం రాదు. బోసినోటి నాగలింగం పెద్దగా నవ్వుతాడు. ఆ తర్వాత సన్నాయివాళ్లు వస్తే ఆ పాటకి డోలు వాయించి కోటిగాడితో ఇంటికి వెళ్ళిపోతాడు.

కళ్ళు సమంగా కన్పించకపోయినా కోటిగాడే నాగలింగం రెండుకళ్ళూ. కోటిగాడు "తాతా!" అంటే చాలు పరుగు పరుగున వెళ్ళి మనవణ్ణి కావలించుకుంటాడు. ఆ రాత్రి ఇంత ఉడకేసుకుని మనవడికింతపెట్టి తనింత గతికి కోటిగాణ్ణి వళ్ళో పడుకోబెట్టుకుని కథలు చెప్తూ "నాన్నా! శంఖం వూదటం నేర్చుకోరా ..." అన్నాడు. "నాకు నిద్రొస్తోంది" అని పడుకున్నాడు కోటిగాడు.

నాగలింగానికి శంఖం అంటే ప్రాణం. మనవడంటే ప్రాణం ..... 'శివా! నాకు వీణ్ణి అంటగట్టి వీడికోసం బతకమన్నావా" అనుకుంటూ కళ్ళు తుడుచుకున్నాడు. ఎదిగివచ్చిన ఒక్కగానొక్క కొడుకు దేశాంతరం వెళ్ళిపోయాడు. కొడుకు వెళ్ళిపోవటంతో కోడలికి మతి స్థిమితం చేడింది. "నా దేవుడేడీ? నా దేవుడేడీ ....." అంటూ అన్ని వీధులూ తిరిగేది. అలా తిరిగి తిరిగి రాయినీ, రప్పనీ అడుగుతూ, చెట్టూ పుట్టా దాటి వూరు విడిచి వెళ్ళి పోయింది. చివరికి

నాగలింగానికి మనవడొక్కడే మిగిలాడు.

పొద్దున్నే లేచి నాగలింగం శంఖాన్ని శుభ్రంగా కడిగాడు. విబూది పెట్టాడు. పూలతో పూజచేసి సాగిలపడ్డాడు. ఎప్పటి శంఖం! తరతరాలనించి వస్తోంది. ఇంత పూజకీ, సంబరానికీ కారణం ఈ రోజు పొలంనుంచి ధాన్యం వస్తోంది. మనవడికీ కొత్త బట్టలు కుట్టించాలి, మిఠాయి తినిపించాలి...... సాయంత్రం మరి కొంచెంసేపు శంఖం ఎక్కువగా ఊదాలి ...... సంబరంగా ఉన్నాడు నాగలింగం.

ఇంతలో వీధిలో రైతులొచ్చిన అలికడయింది. బయటకొచ్చిన నాగలింగానికి బండి కన్పించలేదు. బస్తాలు కన్పించలేదు. రైతులు చెప్పారు "ఆరుబస్తాల ధాన్యం అప్పుకింద సుబ్బయ్య జప్తుచేసుకుని పొలంనుంచే తరలించుకు పోయాడు" అని.

నాగలింగం తల్లడిల్లిపోయాడు. 'సంవత్సరంపాటు తిండిగింజ లేదు .... ఎట్లా గడుస్తుంది. కోటిగాడికి కొత్త చొక్కా .... మిఠాయి ..... నాగలింగం కళ్ళు కోపంతో బుసకొట్టాయి. సర సర నడుచుకుంటూ వూరిపెద్దల దగ్గర కొచ్చాడు. "అయ్యా! అన్యాయం! అప్పుకింద కట్టుకోమనండి. తప్పులేదు. అన్నం లేకుండా చేస్తారా .... ఆకలితో మాడుతూ శంఖం ఎట్లా వూదగలను ...." అని గొల్లుమన్నాడు.

"బాకీ బాకీయే! నీ ఆకలి గురించి నీ శంఖాన్ని అడుగు" అన్నారు పెద్దలు. నాగలింగం వెర్రెత్తిపోయాడు. "నా శంఖాన్నే అడుగుతాను ...." అంటూ బారలు బారలుగా నడిచాడు. మిట్టమధ్యాహ్నం ..... ఎండ మాడుతున్నవేళ వూరికెదురుగా ఉన్న పెద్ద మంటపంలో నిటారుగా కూర్చుని శంఖం పూరించాడు.

"భం ..... భం ..... భం ...."

ఏమి శబ్దం అది! భయంకరంగా ఉంది. ఉరుములు ఉరిమినట్లుంది, భం

..... భం .... అంటూ పిడుగులు పడుతున్నట్లుంది. ప్రళయ భయంకరంగా శంఖం .... జనం గుండెలవిసి పోయాయి. ఇళ్ళల్లోంచి వీధుల్లోకి పరుగెత్తుకొచ్చారు. ఎదురుగా మంటపంలో విలయతాండవంలా భం ... భం...... భం.... అని శంఖారావం ..... చుట్టూ మూగిన జనం శాంతించు ....... శాంతించు తండ్రీ.... అంటున్నారు.

నాగలింగం కళ్లు తెరిచేసరికి ఎవరో పండు చేతికందించారు. నా శంఖమే నాకన్నం పెట్టింది. అంటూ అందులో సగం కోటిగాడికిచ్చి తను సగం తిన్నాడు. ఆనాటినుంచి పొలంలో ధాన్యం గురించి అతను పట్టించుకోలేదు. గుళ్ళో శంఖం వూదినంతసేపు వూదేవాడు. ఎవరో ఇంత అన్నం పెట్టే వారు. పెళ్ళి జరుగుతుంటే వెళ్ళి శంఖం వూదేవాడు. వాళ్ళు ప్రసాదం పెట్టేవారు. జరిగిపోతోంది.

నాగలింగం ఆఖరిదశలో మంచంలో పడుకుని మనవణ్ణి దగ్గరకు తీసుకుని "శంఖం ఊదటం నేర్చుకోరా" అని మళ్ళీ అన్నాడు. కోటిగాడు "నాకు రాదే" అంటే "నాతర్వాత శంఖం ఎవరు వూత్తార్రా" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అదే దిగులు. ఇప్పటికో మరి కాస్సేపటికో అన్నారంతా.

అర్ధరాత్రివేళ దిగ్గున లేచాడు. చుట్టూ ఉన్నవాళ్ళని 'నా శంఖం ఇమ్మన్నాడు మంచంలోంచే శంఖం పూరించాడు ..... భం ..... భం ...... భం...... గుడిసె కదిలిపోతోంది. ఊరు కదిలిపోతోంది. ప్రాణమంతా శంఖంలో పోసి పూరించాడు. వూపిరంతా శంఖంలో పోశాడు. సత్తువంతా శంఖంలో పోశాడు. భం...... భం....... భం.......

చీకటంతా చెదిరిపోయేట్టు భం ...... భం..... భం...... ఉన్నట్టుండి, శంఖం టక్కున ఆగిపోయింది.

కోటిగాడు కెవ్వుమన్నాడు.

నాగలింగం వెళ్ళిపోయినా, శంఖం వూదేవారు లేకపోయినా ప్రతి సాయంత్రం మంటపంలో శంఖధ్వానం విన్పిస్తూనే ఉంది.*